# నా స్మృతి పథంలో ఒక రోజు

- శ్రీమతి మాచిరాజు లక్ష్మి గంగా భవాని.

***గత సంచికలలో ...***

*మద్రాసు (నేటి చెన్నై, అలనాటి చెన్నపట్నం)లో కస్టమ్స్ క్లియరెన్స్ పూర్తి చేసుకుని, బోర్డింగ్ అయ్యాక మాకై నిర్దేశించిన సీట్లలో కూర్చున్నాం! విమానం గాల్లోకి ఎగిరింది. వర్షం పడుతున్నట్లు కిటికీ అద్దంమీద పడుతున్న నీటి తుంపరలు, దూరంగా కనిపిస్తున్న మెఱుపులు తెలియజేస్తున్నాయి. స్థూల శరీరంతో చేసి, సూక్ష్మ శరీరంమీద పడిన ముద్రలు చివరి మజిలీ వరకు చెరిగిపోవు. మద్రాసులో కంప్యూటర్‌లోకి ఎక్కిన సమాచారం, సింగపూర్ వెళ్ళినా, అమెరికాలో అడుగుపెట్టినా మారదు. చెక్కుచెదరకుండా అలాగే రికార్డయి వుంటుంది. సింగపూర్ చేరిన తరువాత బాత్‌రూమ్ వెతుక్కుని, అవశిష్టాలు తీర్చుకుని, కాఫీ ఎక్కడ దొరుకుతుందో బోర్డ్ చూసుకుని, రెండు వీధులంత పొడవుగల హాలంతా నడిచివెళ్ళి కాఫీ తీసుకున్నాము. పెద్ద కప్పుతో డికాక్షన్ ఇచ్చారు. అదే కాఫీ అనుకుని, పంచదార కలుపుకుని, "ఇప్పట్నించి బ్లేక్ కాఫీ అలవాటు చేసుకోవాలేమో!" అనుకున్నాము.*

## శ్రీ గురుభ్యోనమ:

## అమెరికా ప్రయాణంలో అనుభవాలు

ఆ చెట్లు, మొక్కలు ఎలా అంత బలంగా పెరుగుతాయో అని ఆశ్చర్యం వేసింది. ఎక్కడా సూర్యరశ్మి తగిలే అవకాశం లేదు. క్రింద వేసిన మట్టికూడా గోధుమరంగులో, ఉండలు వుండలుగా, చిన్న గోళీకాయసైజులోఉంది. ప్లాస్టిక్‌వేమో! అని అనుమానం వచ్చి, పట్టి చూస్తే అన్నీ మామూలు మొక్కలే, పువ్వులే. ఎక్కడికక్కడ మొక్కలకి ఫౌంటెన్ పద్ధతిలో నీళ్ళు పడుతూ, ఆగుతూ వున్నాయి. మొదట తెలియక వెతుక్కున్నాం గాని, అన్నిచోట్లా, ఎక్కడికక్కడ బాత్‌రూంలు వున్నాయి. అన్నీ నీట్‌గా అన్ని రకాల సదుపాయాలతో అద్దంలా వున్నాయి. ఏది కావాలన్నా, బోర్డ్లు చూసుకుంటూ తెలుసుకోవచ్చు, పెద్ద కష్టం ఏం లేదు. భాషవుంటే అంతా తేలికగానే వుంటుంది. ఒక చోట సింగపూర్ సైట్ సీయింగ్ ఫ్రీగా చూపించే కౌంటరు వుంది. మాకు అంతవరకు సరైన సహకారం అందక పోవడంవలన, నాకు ఇంగ్లీషు రాకపోవడం వలన, నేను వాళ్ళని అడగలేకపోయాను. ప్రయాణీకులు అక్కడక్కడ సోఫాల్లో విశ్రాంతి తీసుకుంటున్నవారిలో కొందరు చీరలు కట్టుకుని భారతీయుల్లా వున్నవాళ్ళలో తెలుగువారు వున్నారేమో! అని పలకరిస్తే, ఒక్కళ్ళు కూడా తెలుగు మాట్లాడేవారు లేరు.

తిరిగి, తిరిగి, అలసటకలిగి, కౌంటరు దగ్గరకి వచ్చి విశ్రాంతిగా కూర్చుని వచ్చేపోయే ఫ్లైట్‌లు చూస్తూ ఏది ఏ ప్రాంతానికి చెందిన ముద్ర కలిగి వుందో, అనుకుంటూ కొంతసేపు కాలక్షేపం చేసాము. ఎయిర్ పోర్ట్ ఎంత విస్తీర్ణం కలిగి ఉందో! ఆ బిల్డింగ్ ఎంత విస్తీర్ణం వుందో తెలియదుగాని, అన్ని వైపులా ఫ్లైట్‌లోకి వెళ్ళి వచ్చే దారులతో రెండు వీధుల పొడుగంత హాల్స్ వున్నాయి. R.T.C. స్టాండ్‌లో బస్సులు గుంపులుగా వచ్చినట్టు, ఫ్లైట్‌లు వస్తూ వెళుతూ వున్నాయి. స్టేండింగ్‌లో 30, 40 కి తక్కువలేవు. అన్ని హాల్స్‌లోనూ ప్రయాణికులు వచ్చేవారు, వెళ్ళేవారు, (ట్రాలీలు తోసుకుంటూ) వందల కొద్దీ జనం అలా తిరుగుతూనే ఉన్నారు. అన్ని చోట్లా నడవక్కర్లేకుండా, నిలబడి వెళ్ళిపోగలిగే బెల్ట్ (ఎస్కలేటర్) ఉంది. అన్ని సెంటర్లలోనూ చుట్టూ ఫోన్‌లు వున్నాయి. పోస్టల్ సదుపాయం, బేంక్ సదుపాయం అన్నీ ఉన్నాయి. ఫోన్ కార్డ్ కూడా దొరుకుతుంది. రెండు గంటలసేపు అలా కాలక్షేపం చేసాము. సింగపూర్ టైమ్ ప్రకారం 7-30కి సూర్యకాంతి కనిపించింది. భారతదేశ కాలమానం ప్రకారం తెల్లవారు జామున బాగా చీకటిగా ఉండే సమయం అది అనుకున్నాము. ఇక్కడి నుండి సమయం అంతా భారత కాలమానం ప్రకారం నోట్ చేసినదే. మూడు గంటలు కాలక్షేపం చేసిన తరువాత, సింగపూర్ ఎయిర్ లైన్స్ కౌంటరులో స్టేఫ్ మారారు. పాతవాళ్ళు వెళ్ళగానే కొత్తగా వచ్చిన వారిని మళ్ళీ అడిగాను. వాళ్ళు అడిగిన ప్రశ్నలకి, తెలుగు తప్ప ఇంకేం రాదన్న పేపరు చూపించాను. తెలుగుమాట్లాడే వాళ్ళు లేరని వాళ్ళు జుత్తు పీక్కున్నారు. ఫోన్‌లో ఎవరికో చెప్పారు. మాటిక్కెట్లు వాళ్ళ దగ్గర వుంచుకుని, మళ్ళీ మమ్మల్ని నిరీక్షించమన్నారు. ఉదయం 7 గంటల 45 నిమిషాలకి ఒక అమ్మాయి వచ్చి మమ్మల్ని లిఫ్ట్‌లో తీసుకువెళ్ళి, ఇంకో హాల్లో కూర్చోపెట్టింది. అక్కడ కూడా పెద్ద పెద్ద టి.వి.లు 5 వున్నాయి. మూడిటిలో వేరు వేరు ప్రోగ్రాములు, రెండిటిలో లోకల్ ప్రోగ్రాములు, వార్తలు వస్తున్నాయి. మాలాగా సహాయం అడిగిన వారందరిని అక్కడ కూర్చోపెట్టారు. వీల్ ఛైర్ అసిస్టెన్స్ కావలసిన వారిని కూడా అక్కడ వుంచి, అక్కణ్ణించే వాళ్ళ వాళ్ళ ఫ్లైట్ టైమ్‌కి తీసుకువెళ్ళి ఎక్కించేవారు.

చాలా సమయం గడిచాకా కౌంటర్‌లో కూర్చున్న అమ్మాయిని సహాయం కావాలని, ఫోన్ చెయ్యాలని అడిగాను. ఆ అమ్మాయి నాతో కూడా వచ్చి, ఫోన్‌కార్డు కొనిపించి, చాలా ఓర్పుగా ఎన్నోసార్లు ఫోన్ ప్రయత్నం చేసింది. అమెరికాకి కనెక్షన్ దొరకలేదు. ఇంటికి ఫోన్‌లో అంతవరకు జరిగినది టూకీగా చెప్పాను. అమ్మాయి దగ్గరవుండి లిఫ్ట్‌లో మళ్ళీ తీసుకువెళ్ళింది. తరువాత మా గురించి ఎవరూ పట్టించుకోలేదు. అక్కణ్ణించి బైటకి వెళ్ళాలంటే లిఫ్ట్ దారి తప్ప మరో దారి లేదు. పూర్తిగా అక్కడ బందీలుగా వున్నట్టు అయిపోయాము. ఆహారం కూడా ఇంకో విధంగా అందే జాడ కనబడలేదు. ముందురోజు రాత్రి మద్రాసులో తీసుకున్న చపాతీలు తిని, అక్కడవున్న మంచినీళ్ళు తాగాము. అప్పటినుంచి మాకు సమయం గడవలేదు. చాలా విసుగు కలిగింది. సింగపూర్ టైమ్ ప్రకారం

*( దీని కొనసాగింపు సామెత కథల అనంతరం (పుస్తకములో 12 వ పేజీలో) చూడండి. )*